క్లుప్తంగా

రాగి వైరు చోరీ

అద్దంకి: పట్టణంలోని శింగరకొండ రోడ్‌లోని మొక్కజొన్న పంట సాగు చేసిన పొలాల్లో ఏర్పాటు చేసిన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి దొంగలు అపహరించుకెళ్లారు. అందులోని రాగి వైరు చోరీ చేశారని రైతు మేడగం అంజిరెడ్డి మంగళవారం తెలిపారు. మొక్కజొన్న నీటి తడులు ఇవ్వాల్సిన సమయంలో చోరీ జరిగినందున పంట ఎడిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు కేసు నమోదుతో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నాడు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులతో వైద్య, ఆరోగ్య సిబ్బంది

మేదరమెట్ల: జిల్లా టాస్క్ ఫోర్స్ సభ్యులు మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అందులో భాగంగా మేదరమెట్ల సచివాయం-1 లో గర్భిణులు, బాలింతలకు, పాఠశాల చిన్నారులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బందికి సలహాలు, సూచనలు చేసిన అనంతరం రికార్డులు పరిశీలించారు. వీరితో పాటు జిల్లా ఎస్‌వో వేణు, సీహెచ్‌వో మల్లికార్జునరావు, డీడీవో లక్ష్మణ్, డాక్టర్లు చిట్టిబాబు ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

స్వాములకు అన్నదానం



మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల పాత గుంటూరు రోడ్డులో అయ్యప్ప స్వామి దేవస్థానంలో గణపతి మురుగన్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో 31వ రోజైన మంగళవారం 260 మంది స్వాములకు అన్నదానం చేసినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. ముండ్లమూరు మండలం వేంపాడు గ్రామానికి చెందిన వాసిరెడ్డి అనిల్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన తల్లిదండ్రులు అనంతలక్ష్మి, రాములు కుటుంబ సభ్యులు అన్నదానం చేసినట్లు పేర్కొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

మేదరమెట్ల: శనగ విత్తనాలు విత్తుకునే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని ఏవో శ్రీనివాసరావు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలం తమ్మవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శనగ పంటపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి చేసుకుంటే ఎండుతెగులు, వేరుకుళ్లు వంటి వాటి నుంచి శనగ పంటను రక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం కలిగిఉన్న వ్యక్తుల అరెస్టు

చీరాల: అక్రమంగా మద్యం కలిగిఉన్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఎస్సై బి.శ్రీహరి, సిబ్బంది కారంచేడు మండలం స్వర్ణ, ఆదిపూడి, కేశవరప్పాడు, కారంచేడు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. దాడుల్లో కారంచేడు కాలువ సెంటర్ వద్ద వాకా కృష్ణ అనే వ్యక్తి అక్రమంగా మద్యం కలిగి ఉండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 14 ఆంధ్ర గోల్డ్ విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

16 మద్యం బాటిళ్లు స్వాధీనం..

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో 16 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై జీవీ చౌదరి తెలిపారు. గ్రామదర్శినిలో భాగంగా గ్రామానికి వెళ్లగా ధర్మవరపు శ్రీను మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందటంతో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాతి ముఖమండప నిర్మాణానికి విరాళం



ఆలయ ఏసీకు చెక్కు అందజేస్తున్న దాతలు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన రాతి ముఖ మండప నిర్మాణానికి దాతలు విరాళం అందించారు. మంగళవారం చిమ్మిరిబండకు చెందిన తాళ్లూరి సాంబశివరావు రూ. 1 లక్షను దేవస్థాన ఏసీఎం తిమ్మనాయుడుకు చెక్కు అంజేశారు. దాతలను దేవస్థాన అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు.

నేడు డయల్ యువర్ డీఎం

అద్దంకి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు బుధవారం సాయంత్రం 4 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అద్దంకి, పరిసర గ్రామాల ప్రయాణికులు 99592 25697 నంబర్‌కు ఫోన్ చేసి అద్దంకి డిపో అభివృద్ధికి అమూల్యమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

గుండ్లకమ్మ రాకతో జోరుగా వరినాట్లు



రైతుల సాగు కోసం పెట్టిన నారుమళ్లు



ఇప్పటికే వేసిన వరి నాట్లు

అద్దంకి:

నిత్యావసర వస్తువులతోపాటు, పశుగ్రాసం, బియ్యం అధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మాగాణి భూమి ఉండి కూడా నీరు లేక వడ్లు పండక రైతులు సైతం బియ్యం కొనుగోలు చేయలేక నానా అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని గుండ్లకమ్మనదికి నీరు చేరరి కళకళలాడటంతో మరలా మాగాణి ఆశలు చిగురించాయి. దానికి తోడు గ్రామ రైతుల వినతితో విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని ఎత్తిపోతల పథకం వినియోగంలోకి వచ్చింది.

నాట్లకు సిద్ధమైన రైతులు..

ఈ ఏడాది వరుణుడు కరుణించి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా నది నీటితో కళకళలాడింది. దాంతో రైతులు కొందరు ఎత్తిపోతల పథకాన్ని మళ్లీ సాగించి మాగాణి పండేలా చేయాలని అనుకున్నారు. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో ఎత్తిపోతల పథకం సాగింది. దాని నీటిని కాల్వకు విడుదల చేయడంతో ఇప్పటికే రైతులు వరి విత్తనాలను తెచ్చి నారుమళ్లు పెట్టారు. ప్రస్తుతం నారు ఏతకు రాగా నాట్లు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరికొందరు రైతులు మరో వారం రోజుల్లో నాట్లు వేయనున్నారు. మొత్తం మీద మరో పదిహేను రోజుల్లో 600 ఎకరాలకు పైగా మాగాణి భూమి పచ్చని నాట్లతో కళకళలాడనుంది. దీంతో రైతుల్లోనూ కూలీల్లోనూ ఆనందం వెల్లివిరుస్తోంది.

- తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకానికి నీరు
- నాట్లు వేస్తున్న రైతులు
- 600 ఎకరాల్లో మాగాణి సాగు



నాటడానికి సిద్ధంగా ఉన్న నారుమడి

మళ్లీ మాగాణి వచ్చింది..

మాఊరికి ఇన్నాళ్లకు మళ్ల మాగాణి వచ్చింది. నదిలో నీరురావడంతో ఎత్తిపోతల పథకం సాగింది. నారు పోసి నాట్లు వేయడానికి సిద్ధం అవుతున్నాం. ఈ సంవత్సరం మాతోపాటు మిగిలిన వారికి బియ్యం ధర తగ్గే అవకాశం ఉంది.

-అదుసుమల్లి రాంబాబు, తిమ్మాయపాలెం

వారంలో నాట్లు వేస్తాం..

గుండ్లకమ్మ నదికి నీరురావడంతో ఎత్తిపోతల పథకం సాగింది. మళ్లీ మాగాణి వచ్చిందనే సంతోషిస్తున్నాం. నార్లుపోశాం. మరో వారంలో మేమునాట్లు వేస్తాం. రైతులతోపాటు, నీటు కూలీలకు ఉపాధి దొరికొంది. మా గ్రామంతోపాటు, పది గ్రామాల కూలీలు మా ఊరిలో నాట్ల కోసం వస్తున్నారు.

-మోటుపల్లి రామయ్య, తిమ్మాయపాలెం

విద్యార్థులను అభినందించిన ఎస్పీ



ఎస్పీ తుషార్ డూడి చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న సాయి కీర్తి



ఎస్పీ చేతుల మీదగా బహుమతి అందుకుంటున్న లక్ష్మీసాయి రాహుల్

మార్టూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలను జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ అభినందించారు. మంగళవారం బాపట్లలో వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఎస్పీ బహుమతులు అందించారు. నిర్వహించారు. మార్టూరు శ్రీనివాస హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న పీ సాయి కీర్తిని మూడో స్థానానికై విజేతగా ఎంపిక చేశారు. ఈసందర్భంగా మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మూడో స్థానాన్ని పొందిన సాయి కీర్తికి ఎస్పీ నగదు బహుమతితో పాటు ప్రశంస పత్రాన్ని అందించి అభినందించారు.

చీరాల: పాఠశాలల స్థాయిలో 'సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర' అనే అంశంపై నిర్వహించిన పోటీలలో చీరాల కొత్తపేటలోని బీఆర్కే హైస్కూల్ విద్యార్థి ఎస్.లక్ష్మిసాయి రాహుల్ ద్వితీయ బహుమతి సాధించాడు. అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మిసాయి ఎస్పీ చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు.

రేపటి నుంచి మంచినీటి సరఫరా నిలిపివేత

చీరాల: పట్టణ పరిధిలోని కారంచేడు రోడ్డులో గల వాటర్ ట్యాంక్ మరమ్మతుల దృష్ట్యా ఈనెల 21 నుంచి నాలుగు రోజులు పాటు మంచినీటి సరఫరా నిలిపివేస్తారని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28వ వార్డు నుంచి 32వ వార్డుల పరిధిలోని ఉజిలిపేట, హరిప్రసాద్‌నగర్, జవహర్‌నగర్, మరియమ్మపేట, జయంతిపేట ప్రాంతాలలో మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. తాగునీరు అత్యవసరమైనప్పుడు వాటర్ ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేస్తామని, 25వ తేదీ నుంచి యథావిధిగా మంచినీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. వార్డుల ప్రజలు గమనించి సహకరించాలని ప్రకటనలో కోరారు.

తీరప్రాంత రక్షణకు పటిష్ట బందోబస్తు



సీ విజిల్‌పై పోలీసులకు సూచనలందిస్తున్న డీఎస్పీ మొయిన్

చీరాల టౌన్: సముద్ర మార్గం నుంచి సంఘవిద్రోహ శక్తులు సమాజంలోకి రాకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని చీరాల డీఎస్పీ మొయిన్ ఆదేశించారు. మంగళవారం చీరాల వాడరేవు గ్రామంలో సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో 'సీ విజిల్' బందోబస్తుపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. తీర ప్రాంత రక్షణలో భాగంగా ఈనెల 20 నుంచి 22 వరకు నిర్వహిస్తున్న సీ విజిల్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సముద్ర మార్గంలో అనుమానితంగా సంచరించే వ్యక్తులు, అక్రమంగా సముద్రం నుంచి సమాజంలోకి చొరబాటు కాకుండా అడ్డుకోవాలన్నారు. అనుమానితులును పూర్తిగా విచారించాలని, అకమంగా మారణాయుధాలు, ఇతర మందుగుండు సామగ్రి రవాణా జరగకుండా చూడాలన్నారు. తీరంలో ఇతర ప్రాంతాలకు చెందిన బోట్లు, పడవలు సంచరించకుండా చూడాలని ఆదేశించారు. సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు సిబ్బందిని పలు బృందాలుగా విభజించి బందోబస్తుకు కేటాయించామన్నారు. తీరప్రాంత గ్రామాలైన వాడరేవు, విజయలక్ష్మీపురం, రామాపురం, కఠారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం తదితర ప్రాంతాలకు కేటాయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని డీఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పి.శేషగిరిరావు, మెరైన్ సీఐ సాంబశివరావు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

బిర్సాముండా గురించి బోధించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవో సుధాకరరావు

అద్దంకి రూరల్: ఆదివాసీ భూహక్కుల కోసం బ్రిటీష్ పాలకులపై ఉద్యమం చేసిన బిర్సాముండా జీవిత చరిత్రను ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాలని ఎంఈవో బీ. సుధాకరరావు అన్నారు. మంగళవారం అద్దంకిలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాల్లో బిర్సాముండా గురించి ఎంఈవో ఉపాధ్యాయులతో చర్చించారు. అదేవిధంగా ఈనెల 24వ తేదీ వరకు విద్యార్థులకు బోధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో గంగాధర్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే స్వాతంత్ర్యం



చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు

సంతమాగులూరు (అద్దంకి): ఎందరో యోధుల పోరాట ఫలితమే స్వాతంత్ర్యమని గ్రంథపాలకుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమర యోధుల వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి, ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఇద్దరి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థినులకు ముగ్గులు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి



చినగంజాంలో ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్

చీరాల అర్బన్: దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు భానుకుమారి హాజరై మాట్లాడారు. ఇందిరాగాంధీ మహిళా సాధికారత కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. ఆమె పాలనలో బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు జరిగిందన్నారు. గ్రంథపాలకురాలు డి.ధనమ్మ మాట్లాడుతూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. అనంతరం బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సౌభాగ్యలక్ష్మి, రూపాదేవి, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: చినగంజాం శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని మహిళా దినోత్సవం నిర్వహించారు. లైబ్రేరియన్ ఆళహరి మోహన లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్ నరసింహారావు, ఆర్‌ఎస్‌వీ పోతురాజు, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పర్వతరెడ్డి కాంతారావు, వై రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాహనం బోల్తా-మహిళకు గాయాలు



ప్రమాదంలో రోడ్డుకు అడ్డంగా పడిన వాహనం

మార్టూరు: వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో మహిళకు గాయాలయ్యాయి. ఈఘటన మంగళవారం ఉదయం మార్టూరు సమీపంలో జరిగింది. ఏఎస్సై మహబూబ్ బాషా వివరాల మేరకు.. తుఫాన్ వాహనంలో ఏడుగురితో చెన్నై నుంచి కృష్ణా జిల్లాకు నందిగామకు వెళ్తోంది. ఈక్రమంలో వాహనం జగద్గురు నూలు మిల్లు సమీపంలోకి రాగేనే ముందు వెళుతున్న వాహనం అకస్మాత్తుగా నిదానం కావడంతో వెనుక వస్తున్న తుఫాన్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో తుఫాన్ వాహనం అదుపు తప్పి ఒంగోలు రహదారిపై అడ్డంగా పడిపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని వాహనంలో ఉన్న ఏడుగురిని బయటకు తీశారు. అందులో మేరీ అనే మహిళకు స్వల్ప గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. హైవే సిబ్బంది రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాన్ని పక్కకు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూశారు.

మురుగునీటి శుద్ధి కేంద్రం నిలుపుదల చేయాలని వినతి



జిల్లా కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న స్థానికులు

చీరాల అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో ఉజిలిపేట దండుబాటలో సుమారు రూ.8 కోట్లతో నిర్మించనున్న మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని స్థానికులు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు వినతిపత్రం అందించారు. ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడం వలన స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. నివాస ప్రాంతాల్లో ప్లాంట్ ఏర్పాటు చేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడతారని, నివాస ప్రాంతాల్లో కాకుండా వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఈపూరుపాలెంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకట మురళి హాజరుకాగా ఆయనను కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎన్.బాబూరావు, ఎల్.జయరాజు, కాలనీవాసులు కోండ్రు కిరణ్, పీ బాబూరావు, నూనె చంద్రబాబు, కట్టా కృపావర్ధన్, నాగం శ్యామ్‌ప్రసాద్, ఆరే నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాలు కీలకం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై

బల్లికురవ: విద్యార్థి దశలో పదోతరగతి ఫలితాలు అత్యంత కీలకమని ఎస్సై జీవీ చౌదరి అన్నారు. మంగళవారం బల్లికురవలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పరీక్షలకు మూడు నెలలే సమయం ఉన్నందున కష్టపడటం తోపాటు ఇష్టపడి చదువుతూ మంచి ఫలితాలు సాధించాలన్నారు. చెడు వ్యవసనాలకు పాల్పడితే జీవితాలే నాశనమవుతాయని ఎస్సై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కే. శ్రీనవాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ ఇంటిపై దాడి

బల్లికురవ: అప్పులు తీర్చలేదని ఓ కుటుంబంపై బాకీదారులు దాడి చేశారు. ఈఘటన మండలంలోని కొప్పరపాడు గ్రామంలో మంగళవారం జరిగింది. బాధితురాలు రాధా వివరాల మేరకు.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని గణపవరం గ్రామానికి చెందిన అచ్చి అంకమ్మరావు సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం వ్యాపారం నిమిత్తం ఇక్కడకు వలసవచ్చారు. నార్కెట్‌పల్లి-మేదరమెట్ల నామ్ రహదారికి తూర్పు భాగంలో సుమారు 12 సెంట్ల స్థలం కొనుగోలుతో వ్యాపారం అక్కడే నివాస గృహం ఏర్పాటు చేసుకున్నారు. మూడేళ్ల క్రితం జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కొప్పరపాడు బీసీ మహిళకు రిజర్వు కాగా అంకమ్మరావు భార్య రాధను ఎన్నికల బరిలో దించారు. ఎన్నికల తదుపరి భర్త చనిపోవటంతో ఆ విషాదంలో ఉన్నారు. వీళ్లకు ఇరువురు కుమార్తెలు. అంకమ్మరావు ఉండగానే ఇరువురికి వివాహాలు చేశారు. భర్త చనిపోగానే మాకు అప్పులు చెల్లించాలని గత నెల 19వ తేదీ దుకాణంపైకి వచ్చి గొడవకు దిగారని చెప్పారు. ఈఅప్పులపై మూడేళ్ల నుంచి కోర్టులో నడుస్తోంది. ఎంత చెప్పినా చెప్పిన వినకపోవటంతో తన బిడ్డ వెంకట పద్మావతి, తాను రోడ్డుపై నామ్ రహదారిపై ఆందోళన చేపట్టామని పోలీసులు రంగ ప్రవేశంతో సర్ది చెప్పారని చెప్పింది. అయితే ఈరోజు మంగళవారం రాత్రి బాకీదారులు దుకాణం ముందు ట్రాక్టర్‌తో వచ్చి ఆగటంతో సరుకు బయటకు వెళ్తోందని గ్రహించుకుని బాకీదారులంతా ఒక్కసారిగా ఎగబడ్డారు. ఏడు నెలల గర్భిణి అయిన వెంకట పద్మావతిపై, తనపై దాడిచేశారని తనకు ప్రాణహాని ఉందని రాధా వాపోయింది.